పేరుకుపోతున్న చెత్తా చెదారం

పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు ● పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

నల్లకుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్త, చెదారం ప్రజలకు శాపంగా మారింది. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వస్తుండడంతోపాటు ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్థానిక ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్యలు పేరుకుపోతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారుల, పారిశుధ్య సిబ్బంది డివిజన్‌లోని మెయిన్‌రోడ్డు, కూడలిప్రాంతాలు, అంతర్గతరోడ్లలో ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. డివిజన్‌లోని గోల్నాక కూరగాయల మార్కెట్, కల్లు కాంపౌండ్ వద్ద, తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి మెయిన్ రోడ్డు పక్కన, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలోని బ్రిడ్జి వద్ద, చేనెంబర్ చౌరస్తా, నర్సింహబస్తీ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోతోంది. ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకున్న పాపానపోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంటింటికీ వచ్చే రిక్షాలు, ఆటోలలోనే చెత్త వేయాలని కూడలి, అంతర్గతరోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని ప్రకటనలు చేస్తున్నారు కానీ వాస్తవ పరిస్థితిలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇకనైనా జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెత్త తరలింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రత్నానగర్ బ్రిడ్జి వద్ద చెత్త


తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి మెయిన్ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త


గోల్నాక కల్లుకాంపౌండ్ సమీపం వద్ద పేరుకుపోయిన చెత్త

చెత్త తరలించడంలో అశ్రద్ధ వద్దు



నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తరలించడంలో జీహెచ్ఎంసీ అధికారులు మాటలు, ప్రకటనలు మానుకుని, చెత్తను వెనువెంటనే తరలించాలి. లేనిపక్షంలో తీవ్ర దుర్గంధంతో ఆ ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడాల్సి వస్తుంది. ఈ విషయంపై అధికారులు అశ్రద్ధ వహించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- కె.కిరణ్‌కుమార్, స్థానికుడు, నల్లకుంట

స్పీకర్‌ను కలిసిన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన చాంబర్‌లో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీఆర్.చందర్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి యాద గిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- నల్లకుంట

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


శైలజా రామయ్యర్‌కు వినతిపత్రం ఇస్తున్న వనం శాంతికుమార్, గంజి మురళీధర్

రాంనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు సంబంధించిన పలు సమస్యలపై సోమవారం నాంపల్లిలోని కార్యాలయంలో రాష్ట్ర చేనేత కమిషనర్ శైలజా రామయ్యర్‌ను తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వనం శాంతికుమార్, గంజి మురళీధర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రిఫ్ట్ పథకంలో చేనేత కార్మికుడితోపాటు అవసరం ఉన్న దగ్గర అనుబంధ కార్మికులకు ఇద్దరి ఇవ్వాలన్నారు. జియో టాగ్ వేయని వారికి మరోసారి రీవెరిఫికేషన్ చేయడం, చేనేత కార్మికుల రుణమాఫీ ప్రాసెస్ నడుస్తున్నదన్నారు. సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణమాఫీ సుమారు 20 కోట్లు, చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ ఈ అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిశీలిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

సన్న బియ్యం పంపిణీ.. పేదల్లో సంతృప్తి

● పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ● పథకాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్తాం : టీపీసీసీ

నల్లకుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల పేద వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని టీపీసీసీ కార్యదర్శి ఎన్.అజయ్ కుమార్, టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఓబీసీ సెల్ సలహాదారు ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సోమవారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ఓబీసీ సెల్ శ్రేణులు కార్యోన్ముఖులు కావాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ మేరకు టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ అక్రమ కేసులను బనాయించడం, రాష్ట్రంలో ఒక్కటైన బీఆర్ఎస్, బీజేపీ లోపాయికారి ఒప్పందాన్ని ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందడుగు వేయాలన్నారు.

నేటి నుంచి 12 రోజులపాటు బైబిల్ తరగతులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో మంగళవారం నుంచి 12 రోజులపాటు పిల్లలు, యువతీయువకులకు ప్రత్యేకమైన బైబిల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు హెబ్రోన్ చర్చి స్థానిక దైవసేవకులు జోసెఫ్ పి.కురియన్, చర్చి సొసైటీ చైర్మన్ జాన్ సుందరం, దైవసేవకులు ఎం.ఇమ్మాన్యుయేల్, మోజెస్, డేవిడ్ తెలిపారు. కేజీ నుంచి పీజీ చదివే విద్యార్థులు, యువకులకు ప్రత్యేకమైన బైబిల్ తరగతులు ప్రతి వేసవిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 3వ తేదీవరకు రోజూ ఉదయం 7.30 నుంచి 10.30గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయన్నారు.

వంగిన చెట్లను కొట్టేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయం ఎదురులేన్‌లో చెట్లు వంగిపోయి పడిపోయే పరిస్థితిలో ఉన్నాయి. గాలిదుమారంతో కూడిన వర్షం వస్తే దాదాపు ఏడెనిమిది చెట్లు పడిపోయే పరిస్థితి ఏర్పడింది. చెట్లు వంగిపోయి ఎప్పుడు పడిపోతాయో అన్నట్లుగా ఉండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్లను కొట్టివేయాలని పీపుల్స్‌హౌసింగ్ కోపరేటివ్ సొసైటీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం రాత్రి భారీ వృక్షాలు పడిపోగా అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు.

విదేశాల్లో తెలుగువారి ఆదరణ ఎంతో గొప్పది

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో తెలుగువారి ఆదరణ ఎంతో గొప్పదని ప్రముఖ శాస్త్రీయ, ఆధ్యాత్మిక గాయని మాళవికఆనంద్ అన్నారు. అమెరికా న్యూజెర్సీ పర్యటనలో ఉన్న మాళవిక ఆనంద్‌ను ఈనెల 19న న్యూజెర్సీలో గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొనేందుకు ఆ సంస్థవారు ఆహ్వానించారు. కార్యక్రమంలో గీతాలు ఆలపించిన మాళవికను సంస్థవారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రమణ యెడ్ల, నరేష్ పెంటారి, రేణుకా కటకం తదితరులు పాల్గొన్నారు.


త్రినాథరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

గాయనీ గాయకులను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గాయనీగాయకులను ప్రోత్సహించాలని ఎస్‌బీఐ మాజీ ఏజీఎం, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు అన్నారు. సుస్వరాలు పేరిట మనం ఫౌండేషన్ అంతర్జాతీయ ఆర్ట్స్, కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో 28వ పాటల విభావరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా త్రినాథరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు డా.చక్రవర్తి, డా.సోమయాజులు, డా.కె.అర్చన, మల్లాది ఉష, జనార్దన్‌రాజు, విద్యాసాగర్, అంజయ్య, శ్రీపాద, సీతాపతిశర్మ, నందగోపాల్, సుబ్బరాజు, వీఎల్‌వీఆర్ జోస్యులు, నాగరాజు, రాజశేఖర్, మూర్తిశ్రీరామ్, ఖాసిం బాష, రాజ్యలక్ష్మి, పద్మావతి, లలిత, శారద, సౌభాగ్యలక్ష్మి, సులక్షణ, కిరణ్మయి, పద్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులకు పెరుగుతున్న ఆదరణ

● పిల్లల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక ఆసక్తి ● పాటలు, లఘు నాటికలు, దేశభక్తి గీతాల్లో శిక్షణ ● బాలల యాక్టివిస్టు శాంతారావు

రాంనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ క్యాంపుల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతున్నదని తల్లిదండ్రులు కూడా సమ్మర్ క్యాంపులో ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారని బాలల యాక్టివిస్టు కె.శాంతారావు పేర్కొన్నారు. బాలోత్సవం కమిటీ పిల్లల్లో విజ్ఞాన వినోద మానవీయ విలువలు చేర్చేందుకు సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లల ఆసక్తిలో కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆట, పాటలు, డ్యాన్స్‌లు, ఇండోర్ గేమ్స్, మ్యాథమెటిక్స్, చిత్రలేఖనం పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. సోమవారం ఉదయం బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శాంతారావు మాట్లాడుతూ పిల్లల్లో పాటలు, లఘు నాటికలు, ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు వంటివి నేర్పించాలన్నారు. బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు కార్మికపేట దళితవాడల్లో నివాస ప్రాంతాల్లో ప్రత్యేకంగా శ్రద్ధపెట్టి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కళ్లముందే అల్లరి పిల్లలు అద్భుతాలు చేస్తుంటే ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పిల్లల ముగింపు ఉత్సవాలు ముచ్చటగా ఒక పండుగలా జరపాలని నేర్చుకున్నవన్నీ తల్లిదండ్రుల సమక్షంలోనే పిల్లలు ప్రదర్శిస్తున్నప్పుడు వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ముగింపు సభకు స్థానిక ప్రజలు, పిల్లలు శ్రేయోభిలాషులు అందరితో పండుగలు జరుపుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కార్యదర్శి ఎన్.సోమయ్య, జి.బుచ్చిరెడ్డి, ప్రతినిధులు ఎం.నాగకృష్ణ, మారన్న, బి.రాధిక, బొడ్డుపల్లి వెంకటేష్, ఎ.గోవర్ధన్, వి.కురుమూర్తి, టి.చెన్నయ్య, టి.వెంకటయ్య, పి.నర్సిరెడ్డి, రూపా, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు


రోడ్డుపై చెత్తను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

రోడ్లపై చెత్తకుప్పలను తొలగించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం డివిజన్‌లోని నింబోలిఅడ్డ, లాల్‌బంగ్లా, బండలబస్తీ, మౌలానాఆజాద్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్ర నిర్వహించి, రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ప్రజలు చెత్త రిక్షాలను సద్వినియోగం చేసుకోవాలని, రోడ్లపై చెత్తకుప్పలు వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు రవియాదవ్, రామారావు, చంద్ర, శ్రవంతి, భీమ్‌రాజ్, శ్రీను, సంతోష్, రామకృష్ణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

● రజతోత్సవ సభ సన్నాహక సమావేశం



బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభ సన్నాహక కార్యక్రమ సమావేశం తెలంగాణ భవన్‌లో జరిగింది. సమావేశంలో పాల్గొన్న అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్, టీఆర్ఎస్ నేతలు సిద్ధార్థ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

29న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి

● 16.75 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలి ● రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 16.75 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీవో, మండల కార్యాలయాల ముట్టడికి ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థుల కోర్ కమిటీ సమావేశం నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా స్కాలర్‌షిప్‌లకు కేటాయించడం లేదని ఆరోపించారు. నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్డు మీదకు వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయల బిల్లులు చెల్లిస్తున్నారు కానీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు బడ్జెట్ లేదని ప్రశ్నించారు. ఒక కాంట్రాక్టర్‌కు ఇచ్చే బిల్లులతో 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్ చెల్లించవచ్చన్నారు. ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదన్నారు. తన వైఖరి మార్చుకోకపోతే తీవ్రంగా తిరుగుబాటు ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు నడుస్తున్నా ఇంత వరకు బకాయిలు చెల్లించడానికి ముందుకు రావడం లేదని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు రూ.4 వేల కోట్లు తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, అంజి, రాందేవ్ మోదీ, గొరిగే మల్లేష్, అనంతయ్య, రాజునేత, రాజేందర్, రవి కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వనదుర్గమ్మకు పూజలు చేస్తున్న సిద్ధార్థ్ ముదిరాజ్ తదితరులు

ఏడుపాయల వనదుర్గమ్మకు బీఆర్ఎస్ పూజలు

అంబర్‌పేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవం విజయవంతం కావాలని అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మెదక్‌జిల్లాలోని ఏడుపాయల వన దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్ సాయి, దశరత్, తదితరులు పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి

రాంనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి కలెక్టర్‌కు మిస్ వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, నాయకులు స్వరూప, శిరీష, లక్ష్మీబాయి, ప్రేమలత, చైతన్య, శ్రీదేవీ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సమస్యలు, సవాళ్లు ఉండగా కోట్లకు ప్రజాధనాన్ని అందాల పోటీల కోసం ఖర్చు చేయడం అన్యాయం అన్నారు. మిస్ వరల్డ్ పోటీలలో మహిళల ఎన్నిక విధానం తెలంగాణ మహిళలకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పోరాట వారసత్వం గల తెలంగాణ లో ఈ పోటీలో నిర్వహించడం ఇక్కడి మహిళలను అవమానపరచడమేనన్నారు. తక్షణమే ఈ పోటీలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.


రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అందాల పోటీల వ్యతిరేక వేదిక నేతలు


అంజనికుమారికి సోషల్ ఎక్స్‌లెన్స్ అవార్డును బహూకరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

అర్హులకు అవార్డులు ఇవ్వడం అభినందనీయం

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అర్హులకు అవార్డులు ఇవ్వడం అభినందనీయమని హాస్యావధాని, సీనియర్ జర్నలిస్టు శంకరనారాయణ అన్నారు. సిటీ సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారి సోషల్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేశారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును హాస్యబ్రహ్మ, సీనియర్ జర్నలిస్టు శంకరనారాయణ బహూకరించారు. ఆయన మాట్లాడుతూ అంజనికుమారి విధులు నిర్వహిస్తూనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి పేరు సంపాదిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఆలూరి విల్సన్, పేరడీ గురుస్వామి, కార్యదర్శి ఇందిర, రామకృష్ణ, వినోద్‌కుమార్‌గౌడ్, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, గోపయ్య, వేణు, ఉషారాణి, సృజన్‌కుమార్, బ్రాహ్మణి, రాధ, లావణ్య, మాధురి, జ్యోతి, మాధవి, తరుణి, నాగరత్నం, విజయ్‌కుమార్, అశ్విని, అరుణ, రాజ్యలక్ష్మి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై రంబుల్ స్ట్రిప్స్.. ట్రబుల్స్

● కొన్నింటిని తగ్గించాలి : బీఆర్ఎస్ నేతలు

గోల్నాక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట చేనెంబర్ ఫ్లైఓవర్‌పై ఏర్పాటుచేసిన రంబుల్ స్ట్రిప్స్ ప్రమాద భరితంగా మారాయని, దీంతో పలువురు వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం దూసరి శ్రీనివాస్‌గౌడ్ పార్టీ నేతలు సిదార్థముదిరాజ్, భూపతి లక్ష్మణ్, ముడిగ నర్సింగ్‌యాదవ్, శివరామకృష్ణ రాజు, శేఖర్, అరవింద్ తదితరులతో కలిసి అంబర్‌పేట చేనెంబర్ ఫ్లైఓవర్‌ను సందర్శించి, రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలించారు. 50 ఫీట్స్‌కు ఒకటి ఉండడం వల్ల వాహనదారులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, గర్భిణులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అందులో కొన్నింటిని తొలగించి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారులను, ప్రభుత్వాన్ని వారు కోరారు. రంబుల్ స్ట్రిప్స్ ఉండడం మంచిదే కానీ ఎక్కువగా ఏర్పాటు చేయడంతో అవి ప్రమాదకరంగా మారాయన్నారు. అందుకే అందులో కొన్ని తొలగించి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకే తాము స్వయంగా పరిశీలించి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.


ఛేనెంబర్ ఫ్లైఓవర్‌పై ప్రమాదకరంగా మారిన రంబుల్ స్ట్రిప్స్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని బాపూజీనగర్ అంగన్‌వాడీ టీచర్ విమల అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషక పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలికలు, చిన్నారులతో కలిసి సమావేశం నిర్వహించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు ఝాన్సీ, భాగ్యరేఖ పాల్గొన్నారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు